ఎమ్మెల్యేకు ఉగాది శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును బుధవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కర్రె జంగయ్య, మేకల హరినాథ్, మైపాల్‌రెడ్డి, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో మైనర్లు పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలి

అడ్డగుట్ట: ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో మైనర్లు పాల్గొనకుండా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచారాల్లో పిల్లలను కూడా తీసుకెళ్తున్నారన్నారు. బస్తీల్లో రాజకీయ పార్టీలు పంచుతున్న మద్యం, మాదకద్రవ్యాలలో పిల్లలను భాగస్వామ్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఎండలు, రోడ్‌షోల్లో పాల్గొనే పిల్లలు తొక్కిసలాటలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలలను ప్రచారంలో ఉపయోగించడం చట్టరిత్యా నేరమని పేర్కొన్నారు. బాలల హక్కులను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నామన్నారు.

చెట్లు.. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలే.. బస్‌షెల్టర్లు

● అసలే ఎండాకాలం.. ఆపై భగభగలు ● ప్రయాణికులు అవస్థలు పడుతున్నా పట్టించుకోని అధికారులు



ఓల్డ్ హాఫీజ్‌పేట్‌లో చెట్ల కొమ్మల నీడలో నిలబడిన ప్రయాణికులు



రోడ్డుపైనే ఆగుతున్న ఆర్టీసీ బస్సు

హాఫీజ్‌పేట్: బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు నానా ఇబ్బందులుపడుతున్నారు. ఎండాకాలం కావడంతో నీడ కోసం వెతుక్కుంటున్నారు. హాఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్ల పరిధిలో ఆర్టీసీ బస్టాప్‌లలో ప్రయాణికులు నిలబడడానికి షెడ్లు కూడా లేకపోవడంతో చెట్టు కొమ్మలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, దుకాణాల ముందు ఉన్న నీడలో ప్రయాణికులు నిల్చునే పరిస్థితి నెలకొంది. హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చౌరస్తా మొదలు ఓల్డ్ హాఫీజ్‌పేట్, న్యూహాఫీజ్‌పేట్, సీఆర్ ఫౌండేషన్, మదీనాగూడ దీప్తిశ్రీనగర్, గంగారం, చందానగర్ బస్టాప్‌ల వద్ద నీడ లేక ప్రయాణికులు చెట్టు కింద నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. వేసవి కాలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న తరుణంలో ప్రయాణికుల బాధలు చెప్పనక్కర్లేదు. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు బస్సుల కోసం రోడ్డుపై పరుగెత్తుతుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ అధికారులు షెడ్డులను నిర్మించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

- ఓల్డ్ హాఫీజ్‌పేట్, న్యూ హాఫీజ్‌పేట్‌లోని ఆదిత్యనగర్ ఇరువైపులా, సీఆర్ ఫౌండేషన్, మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌లలో బస్‌షెల్టర్‌లను ఏర్పాటు చేయాలి.
- ఆర్టీసీ బస్సులు ఇష్టానుసారంగా నిలుపకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి కేవలం బస్టాప్‌లలో నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి
- ఆర్టీసీ బస్సులు వచ్చే సమయాలకు సంబంధించి సూచిక బోర్డులను ఉంచాలి
- కొన్ని బస్టాప్‌ల పక్కన దుకాణాల వల్ల స్టాప్ కనబడకుండా పోతుంది. వెంటనే వాటిని అధికారులు తొలగించాలి
- బస్టాపులలో బెంచీలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుపైనే బస్సులు ఆపుతున్నారు



ఓల్డ్ హాఫీజ్‌పేట్‌లో ఇరువైపులా బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలి. చెట్టు కొమ్మల కింద బస్సు కోసం నిలబడుతున్నాం. ఆర్టీసీ బస్సులు బస్టాప్‌లలో ఆపకుండా రోడ్డుపైనే ఆపుతుండడంతో ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. ఇప్పటికైన అధికారులు స్పందించాలి. – మనోజ్, ఓల్డ్ హాఫీజ్‌పేట్

తాగునీరు అందుబాటులో ఉంచాలి



ఎండాకాలం బస్టాప్‌లలో ప్రయాణికుల దాహర్తి కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రతి బస్టాప్‌లో తాగునీరు అందుబాటులో ఉంచాలి. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బస్టాప్‌లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. –సయ్యద్, న్యూ హాఫీజ్‌పేట్

రంజాన్ శుభాకాంక్షలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ ముస్లింలకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టతని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని కోరారు.

'ఇంటి వద్దకే సీతారాముల తలంబ్రాలు'

మూసాపేట: భద్రాచలం సీతారాముల తలంబ్రాలను ఇంటికే అందజేస్తామని కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్‌ఎం కవిత తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో కార్గో ద్వారా సీతారాముల తలంబ్రాలు ఇంటి వద్దకే అనే పోస్టర్‌ను ఆమె డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీతారాముల తలంబ్రాలను కోరుకునే భక్తులు కూకట్‌పల్లి డిపో టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రంలో రూ.151 చెల్లించి బుక్ చేసుకోవాలన్నారు. ఈనెల 18వ తేదీ వరకే బుక్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జమ్మన్నను లేదా ఫోన్ నం.9154298824, 9154298839లో సంప్రదించాలని కోరారు.

ఇందిరాహిల్స్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరా హిల్స్ కాలనీలో బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, తక్కువ ప్రెషర్‌తో నీరు సరఫరా అవుతోందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పైపులైన్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌యస్ పార్టీ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్, నాయకులు కాశీనాథ్ యాదవ్, చిన్నోళ్ల శ్రీనివాస్, రాజు, మల్లేష్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో ఏర్పాట్లు పూర్తి



హైదర్‌నగర్‌లోని ఈద్గా ఆవరణను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లో రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఈద్గా కమిటీ సభ్యులతో బుధవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈద్-ఉల్-ఫితర్‌ను పురస్కరించుకొని సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు షరీఫ్, హమీద్, హబీబ్, ఫిరోజ్ ఖాన్, ఖలీం, జమీరుద్దీన్, ఫసియుద్దీన్, రహమాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధి భూదేవిహిల్స్‌లోని షాలేం ఎవాంజిలికల్ చర్చ్‌లో పాస్టర్ శ్యామ్ జాషువా మధిర ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పాస్టర్స్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సీహెచ్.భాస్కర్, యాదగిరి, గోపాల్, సంగారెడ్డి, రాజు, పాస్టర్లు సత్యరాజు,సురేష్, నాగభూషణం, ఆంద్రూస్, రవిబాబు, జార్జ్, ఆనంద్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆల్విన్‌కాలనీ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ కాలనీలో బుధవారం డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, కన్వీనర్ రాఘవేంద్రరావు, కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, నరేష్, నరేందర్‌రెడ్డి, మణిభూషణ్, కేశవ్‌లు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ దేశం బాగుండాలంటే మళ్లీ మోడీ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ ముఖ్య నాయకులు, డివిజన్ పదాధికారులు, మహిళామోర్చా, యువమోర్చా, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: రజక సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చాగంటి అశోక్, డివిజన్ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్ నేతతో కలిసి బుధవారం సంఘం కేలండర్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ చిన్నోళ్ల శ్రీను, డివిజన్ అధ్యక్షుడు శ్రీను రజక, వెంకటయ్య, సరసయ్య, ఆంజనేయులు, బంగారయ్య,జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కార్యకర్తల సమావేశంలో మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి, బండి రమేష్

బాలానగర్: రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలును విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె బాలనగర్ పార్టీ కార్యాలయానికి వచ్చారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులతో నియోజకవర్గంలో జరుగుతున్న ప్రచారంపై ఆమెతో చర్చించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లటం ద్వారా కాంగ్రెస్ పార్టీ పట్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుందన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆమె కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం పార్టీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు.

వైభవంగా రంగనాథుడి ఉత్సవాలు



రాయదుర్గం: గోపన్‌పల్లి రంగనాథుడి ఉత్సవాలు రెండో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయ సమీపంలోని శ్రీరంగ సింగబావి వద్దకు తీసుకెళ్లి అక్కడ అవభృత స్నానం చేయించి ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.రంగనాథస్వామిని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు దర్శించుకున్నారు. ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్ దూబే, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



రంగనాథస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, శ్రీకాంత్, భక్తులు

నేడు సాయిబాబా ఆలయాల్లో అన్నదానం

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలోని పలు ప్రాంతాల్లోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూసాపేట డివిజన్ పరిధిలోని పాండురంగనగర్ శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం, అవంతినగర్ తోట, మోతీనగర్ ప్రధాన రోడ్డులోని షిరిడీ సాయబాబా దేవాలయంలో అన్నదానం కార్యక్రమం ఉంటుంది. అల్లాపూర్ డివిజన్ శ్రీగణేష్‌నగర్, శ్రీవివేకానందనగర్‌లోని సాయబాబా దేవాలయాల్లో కూడా అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఓయూలో అధ్యాపక నియామకాలు హుళక్కే..

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ ఏడాది చివరినాటికి వరుసగా ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ ఖాళీగా ఉన్న అధ్యాపక నియామకాలకు అడ్డంకిగా మారనున్నాయి. అధ్యాపకుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న ఓయూలో కనీసం కాంట్రాక్టు అధ్యాపకులను కూడా నియమించకుండా గత ప్రభుత్వం 2014లో జీవో జారీ చేసింది. కేవలం పార్ట్‌టైమ్ అధ్యాపకులచే బోధన కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రొఫెసర్ల కొరత కారణంగా పీహెచ్‌డీ ప్రవేశాలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఓయూ విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు.

ఓయూలో బయటి వ్యక్తుల ఆగడాలు అరికట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: క్యాంపస్‌లోకి బయటి వ్యక్తుల ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు ఓయూను క్లోజ్డ్ క్యాంపస్‌గా తీర్చిదిద్ది బయటి వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. బైక్‌రైడింగ్స్, గంజాయి, మద్యం సేవించడం రియల్ ఎస్టేట్ దందాలు, తదితర అసాంఘీక కార్యక్రమాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లి సత్య, భగత్, శ్రీకాంత్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.


బదిలీల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి



ట్రాన్స్‌ఫర్లను ఆపాలంటూ డిమాండ్ చేస్తున్న ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు, హెల్పర్లు

మూసాపేట: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు ట్రాన్స్‌ఫర్ల విషయంపై ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు, హెల్పర్లు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి జోనల్ పరిధిలో ఔట్ సోర్సింగ్ డ్రైవర్లు, హెల్పర్లుగా విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వేర్వేరు ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ తెలిపిన విధంగా 2 నెలలు హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్ విజ్ఞప్తి మేరకు వెళ్లామన్నారు. మరికొంత మందిని యూబీడీ విభాగానికి పంపించారన్నారు. ప్రస్తుతం పని ఉన్న కొంత మందిని ట్రాన్స్‌ఫర్ చేశారని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫర్ల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశామని తెలిపారు.

ఆకట్టుకున్న మోహినీ భస్మాసుర నాటకం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఫిలింనగర్: ఉగాది పద్య నాటకోత్సవాల్లో భాగంగా పాత్తూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటికలు ఆకట్టుకుంటున్నాయి. ఫిలిం ఛాంబర్ ఆవరణలోని రామానాయుడు కళామండపంలో బుధవారం మోహిని భస్మాసుర పౌరాణిక పద్య నాటకాన్ని ఉషోదయ నాట్య కళామండలి నటులు ప్రదర్శించారు. రెండున్నర గంటల పాటు సాగిన ఈ నాటకాన్ని కళాకారులు రక్తికట్టించారు. గయోపాఖ్యాన యుద్ధ సన్నివేశంలో శ్రీకృష్ణుడిగా బంగారు కంకణ గ్రహీత ఎం.రామలింగేశ్వరరావు, అర్జునుడిగా ఉప్పాల రాజేశ్వర్‌రావు భస్మాసురుడిగా మొగిలిపువ్వు వెంకటసుబ్బయ్య, నారదుడిగా ఆసోది అక్కిరెడ్డి, శంకరుడిగా కేసన నాగేశ్వర్‌రావు, విష్ణుమూర్తిగా కొప్పరపు శ్రీనివాసరావు, చిక్కాసురిడిగా ఆరాధ్యుల శ్రీనివాసరావు, డక్కాసురిడిగా మద్రివాడ సుబ్బారావు, లక్ష్మీగా సురభిజ్యోతి, మోహినిగా తిరుమలాబి ,భృంగీశ్వరుడిగా బొక్కసం సత్యనారాయణ నటించారు. ఈ నాటికకు హార్మోనియం సి.హెచ్.శ్రీనివాసరావు, డోలక్ బాపిరెడ్డి, ఆహార్యం వెంకటస్వామి సహకారం అందించారు. వీనుల విందుగా సాగిన ఈ నాటకాన్ని సినీ ప్రేక్షకులు, కళాభిమానులు వీక్షించి పరవశించిపోయారు.

షాపింగ్‌మాల్స్ వద్ద అక్రమ పార్కింగ్ తొలగింపు



సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్ వద్ద అక్రమ పార్కింగ్‌ను తొలగిస్తున్న అధికారులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి వివేకానందనగర్ కమాన్ వరకు ఉన పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ రోడ్డును ఆక్రమించి అక్రమ పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారని స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏకాంత్‌గౌడ్ కూకట్‌పల్లి జోనల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు స్పందించలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కూకట్‌పల్లి సర్కిల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, షాపింగ్‌మాల్స్ వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన పార్కింగ్‌ను తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులను ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని కోరారు.

వైశాఖీ ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అమీర్‌పేట: ఖల్సాపంత్ 325వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట్‌లోని ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు వైశాఖీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురుద్వారా ప్రతినిధులు తెలిపారు. బుధవారం అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ దర్శణ్ సింగ్, సర్దార్ సురేందర్‌సింగ్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో వైశాఖీ ఉత్సవాలు అమీర్‌పేట వేదికగా జరుగుతాయని, ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే వేడుకలకు సిక్కులు, ఇతర మతాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో హాజరవుతారని చెప్పారు. మొదటి రోజున అమృత్‌పాన్ (హోలీ బాప్టిజన్) కార్యక్రమం ద్వారా సిక్కు మత గురువులు ప్రత్యేకంగా తయారు చేసిన పానీయాన్ని పిల్లలు, యువకులు, మహిళలకు పంచిపెడతారన్నారు. 13న విశాల్ దివస్, 14న కీర్తన్ దర్బార్ ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది శ్రీ గురుగోవిందసింగ్ వంశపారంపర్యంగా వస్తున్న 5 అరుదైన గుర్రాలు వేడుకల్లో పాల్గొంటాయని వివరించారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్ సిక్కు మతగురువులు, మహారాష్ట్ర నుంచి మరాఠా జత్తా (భజన) బృందం కూడా వస్తుందన్నారు. ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు షాక్.!

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావుతో కలసి ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనాయకులు ముఖ్యమంత్రిని కలసి పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ గొల్ల కురుమ నవ నిర్మాణ సంఘం అధ్యక్షుడు కనకరాజు యాదవ్, కుంటన్న, గోపాల్ ముదిరాజు, మల్లేష్ కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ పార్టీ అంజయ్యనగర్‌లో చతికిల పడినట్లయ్యింది.

కనకరాజు యాదవ్ చేరికతో కాంగ్రెస్‌కు బలం..

- హస్మత్‌పేట, అంజయ్యనగర్ ప్రాంతాలలో బలమైన నాయకుడిగా కనకరాజు యాదవ్ మంచి పేరుంది. ఇప్పుడు ఆయన బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.
- ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ... మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి సునితామహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా కృషి చేస్తామన్నారు.
- టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. భవిష్యత్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కష్టపడి పని చేస్తామని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కనకరాజు యాదవ్



ముఖ్యమంత్రి నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్‌రావు, కూన శ్రీశైలంగౌడ్‌తో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు